విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దుస్తుల దుకాణం దగ్ధం

మంటల్లో దగ్ధమైన వస్త్ర దుకాణం

మదనపల్లె అర్బన్: పట్టణంలోని రీడింగ్ రూమ్ వీధిలోని తాజ్ క్యాట్స్ సెంటర్ అండ్ టెక్స్‌టైల్స్ షోరూంలో మంగళవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రూ.70 లక్షల వరకు నష్టం వాటిల్లింది. అగ్నిమాపక అధికారి పురుషోత్తమ నాయుడు కథనం మేరకు.. రీడింగ్ రూము వీధిలోని అండర్ గ్రౌండులో మినరుద్దీన్ దుస్తుల దుకాణం నిర్వహిస్తు న్నాడు. ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి దుకాణంలోని దుస్తులకు మంటలు వ్యాపించాయని తెలిపారు. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. జీవనాధారమైన బట్టలు దుకాణం అగ్నికి ఆహుతి కావడంతో రోడ్డున పడ్డామని భాదితుడు మినరుద్దీన్ వాపోయారు.

'ఉక్కు' ఆశలపై నీళ్లు!

- కేంద్రంలోని బిజెపి సర్కారు ఝలక్
- రాష్ట్రానికి మరో 'సారీ' మొండిచేయి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ బుట్టదాఖలైంది. 2014లో రాష్ట్ర విభజన సమయంలో అప్పటి యుపిఎ-2 సర్కారు కడప జిల్లాలో ఉక్కు పరిశ్ర మను ఏర్పాటు చేయాలనే ప్రకటించిన సంగతి తెలిసిందే. 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి సర్కారు ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి పలు రకాల సర్వేలు, టాస్క్ ఫోర్స్‌ల పేరుతో అధ్యయ నాలు చేయించింది. ఇటువంటి పరిస్థితుల నేప థ్యంలో మంగళవారం పార్లమెంటులో టిడిపికి చెందిన ఇద్దరు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి నిత్యానందరాయ్ సర్వే సంస్థలు లాభసాటి కాదని తేల్చాయని, ఉక్కు పరిశ్ర మను ఏర్పాటు చేయడం కుదరదని కుండబద్దలు కొట్టి నట్లు సమాధానం చెప్పడం విస్మయాన్ని కలిగించింది. ఉమ్మడి రాష్ట్ర హయాంలో అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ఆర్ ప్రయివేటు రంగంలో బ్రహ్మణీ పేరుతో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. సుమారు 20 నుంచి 40 శాతం మేరకు పనులు పూర్తి చేశారు. 2009 అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ఆర్ మృతి చెందారు. వివిధ రకాల కారణాలతో బ్రహ్మణీ ఉక్కు పరిశ్రమ నిర్మాణం నిలిచిపోయింది. రాష్ట్ర నాయకత్వ బాధ్య తలు మారడంతో బ్రహ్మణీ పరిశ్రమ కథ కంచికి చేరింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర విభజన హామీలు, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రధానాంశాలుగా మారడం తెలిసిందే. అప్పటి టిడిపి సర్కారు నిర్లక్ష్యం వెరసి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వైసిపి సర్కారు అధికారంలోకి వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్య మంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రముఖ ఉక్కు దిగ్గజ సంస్థ జెఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర హోంశాఖా సహాయమంత్రి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దేశంలోని ప్రయివేటు, కార్పొరేట్లకు లాభసాటిగా కనిపించిన ఇనుప ఖనిజం ఎగుమతులు, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కార్యకలాపాలు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన సెయిల్‌కు ఎందుకు లాభసాటిగా కనిపించడం లేదనే చర్చ నడుస్తోంది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రాష్ట్రంపై చిన్నచూపు చూస్తోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రంలోని బిజెపి సర్కారు ద్రోహపూరిత వైఖరి పట్ల ప్రజానీకం అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతుందని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి మండలంలోని తుమ్మనగుంటలో ఏర్పాటు చేసిన టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ కేంద్రాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఎంపిడిఒ కార్యాలయంలోని వీడియో కానఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మదనపల్లె ఆర్‌డిఒ మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ కేంద్రాన్ని ప్రారంభించడం ఎంతో శుభపరిణామమన్నారు. రైతులందరూ టమోటా ప్రాసెసింగ్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ గ్రీన్ లీఫ్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని దాదాపు 1002 మంది రైతులతో పిపిసి ఏర్పాటు చేశామన్నారు. ఈ పిపిసిలో అన్ని రకాల వెజిటేబుల్స్‌ను ఇక్కడే ప్రాసెసింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో దాదాపు 25 మందికి నేరుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పిపిసి ఎఫ్‌పిఒ ద్వారా రైతులకు నేరుగా ఇన్‌పుట్, మార్కెటింగ్ ఇంటర్వెన్షన్స్ చేయడంతోపాటు ప్రాసెసింగ్ చేసిన వెజిటబుల్స్‌ను రవాణా చేస్తామన్నారు. పిపిసి ద్వారా ప్రతి గంటకి ఒకటిన్నర టన్నుల టమోటా ప్రాసెసింగ్ జరుగుతుందన్నారు. 250 మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు పెట్టడం జరిగిందన్నారు. గతంలో తంబళ్లపల్లె నియోజకవర్గం ప్రజలు మదనపల్లెకు వెళ్లి దాదాపు 30-40 కిలోమీటర్లు ప్రయాణం చేసేవారని ప్రస్తుతం ఇప్పుడు టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల ఆ ఖర్చులేవీ రైతులకు ఉండవన్నారు. ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన హామీలు రెండింతలు నెరవేర్చారన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం ప్రజలకు ఎంతో అభిమానమన్నారు. గతంలో ఎప్పుడూ ఎన్నడూ లేని విధంగా రైతుల కోసం ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేయడం ప్రతి ఒక్కరూ ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి జిల్లా వ్యవసాయ సలహా మండల సభ్యులు పంజం సుకుమార్‌రెడ్డి, తుమ్మనగుంటలో ఏర్పాటు చేసిన టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ కేంద్రానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, తహశీల్దారు రఫిక్ అహ్మద్, ఎంపిడిఒ శంకరయ్య, ఎంపిపి లక్ష్మీనరసమ్మ, జడ్‌పిటిసి రామచంద్ర, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డి, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాంరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు అరుణ్ కుమార్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, నియోజవర్గం సేవాదళ్ అధ్యక్షుడు సల్మాన్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఖలీల్ అహ్మద్, తుమ్మనగుట్ట గ్రామ సర్పంచ్ రుక్మిణి, రైతులు పాల్గొన్నారు.

టమోటా ప్రాసెసింగ్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి హయాంలోనే బిసిల అభివృద్ధి

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలోనే బిసిలు అభివృద్ధి చెందారని ఆ సానీకట బిసి సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్‌నాయుడు అన్నారు. టిడిపి బిసి ఫెడరేషన్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర పిలుపు మేరకు మంగళవారం మండలంలోని జాండ్ల పంచాయితీ, ఆవులయ్యగారిపల్లిలో టిడిపి బిసి సాధికారిక సమితి పాల ఏకిరి కమిటీ సభ్యుడు జ్యోత భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో పాల ఏకిరిలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ నాయుడు మాట్లాడుతూ బిసిల అభివృద్ధి ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో బిసిల అభివృద్ధి కోసం పలు పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఆ పథకాలన్నీ బిసిలకు నేరుగా దక్కేలా అన్ని చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం బిసిల సంక్షేమానికి తగు చర్యలు తీసుకోకపోగా, ఉన్న అరకొరా పథకాలను కూడా వైసిపి నాయకులే అనుభవిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం బిసిలపై కపట ప్రేమ చూపెడుతూ నిధులు లేని కార్పొరేషన్లను ఏర్పాటు చేసి మా ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తోందని ఎద్దేవా చేశారు. పాల ఏకిరులందరూ వచ్చే ఎన్నికల్లో నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ కన్వీనర్ పులసర శివప్ప నాయుడు, చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ మల్లూరు దేవి, స్టేట్ కోఆర్డినేటర్ జీవన్ కుమార్ నాయుడు, స్టేట్ డైరెక్టర్లు ఎం. వేణుగోపాల్ నాయుడు, బంగారు నారాయణస్వామి నాయుడు, కీరమంద శ్రీనివాసులు నాయుడు, రాగినేని రఘుపతి నాయుడు, మనిగే ఢిల్లీ భాస్కర్ నాయుడు, కమిటీ సభ్యుడు జీవి నాయుడు, కసినేని విశ్వనాథ నాయుడు పాల్గొన్నారు.

31న ఎఎఫ్‌యులో రెండో విడత ప్రవేశాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ(వైఎస్ఆర్ ఏఎఫ్ఎయూ)లో ఈనెల 31న రెండో విడత ప్రవేశాల ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఏడీసెట్-2023 కమిటీ చైర్మన్ ఆచార్య బి. ఆంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరం సంబంధించి బిఎఫ్ఎ పెయింటింగ్, శిల్పం, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్స్, ఫొటోగ్రఫీ, బ్యాచిలర్ ఆఫ్ ఇంటీరియర్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి తొలి విడతలో హాజరు కాలేని విద్యార్థుల సౌకర్యార్థం రెండో విడత ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశాలు పొందే అభ్యర్థులు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాల కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండుసెట్ల జిరాక్స్ ప్రతులు, ఆరు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, నిర్ణీత ఫీజుతో హాజరుకావాలని సూచించారు.

అంకాలమ్మగూడూరులో విషాదం

- అన్నాచెల్లెలును కాటేసిన పాము - అన్న మృతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడూరు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. అన్నా చెల్లెలును పాము కాటు వేసింది. ఈ సంఘటనలో అన్న మృతిచెందాగా చెల్లెలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు, అనురాధ దంపతులకు కుమారుడు నవదీప్ (12), కుమార్తె భవ్యశ్రీ ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న అన్నాచెల్లెలను పాము కాటేసింది. తల్లిదండ్రులు, బంధువులు గుర్తించి ఇద్దరిని పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. నవదీప్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. భవ్యశ్రీ పరిస్థితి విషమంగా ఉండడంతో కడపకు రెఫర్ చేశారు. అభంశుభం తెలియని చిన్నారులను పాము కాటేయడంతో అంకాలమ్మ గూడూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాముకాటుకు గురై కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు విచారంలో ఉన్నారు. చిన్నారుల తండ్రి రామాంజనేయులు తొండూరు పోలీస్‌స్టేషన్‌లో హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు.

చిత్ర కళాశాఖను సందర్శించిన వైవీయూ ప్రిన్సిపల్

ప్రజాశక్తి - కడప అర్బన్

చిత్రాలు మనిషికి ఆహ్లాదం వినూత్న ఆలోచనలకు మార్గాలని వైవీయూ ప్రిన్సిపల్ ఎస్. రఘునాథ్‌రెడ్డి అన్నారు. వైవీయూలోని ఆర్ట్స్ బ్లాక్ ను మంగళవారం సందర్శించారు. అన్ని శాఖలలో కొనసాగుతున్న తరగతులను పరిశీలించారు. అనంతరం చిత్రకళ విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. వారు గీసిన చిత్రాలను పరిశీలించారు. ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ మృత్యుంజయరావు విద్యార్థుల ప్రగతిని వివరించారు.

'మణిపూర్' ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజల మధ్య చిచ్చు పెట్టిన మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మణిపూర్ సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, వైఎస్సార్ సర్కిల్ మీదుగా బంగ్లా సెంటర్ వరకు సాగింది. ప్రదర్శనలో 'అత్యాచార దుండగులను శిక్షించాలి.. మతోన్మాదాన్ని తరిమి కొడదాం.. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మణిపూర్ హింసను అదుపుచేయడంలో అక్కడున్న బిజెపి ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలను బయటకు రానీయడం లేదనీ, ప్రభుత్వం స్పందించి దానిపై ఎలాంటి చర్య తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అయినా దాన్ని పరిష్కరించాలనే దిశగా కేంద్రంలోని హోమ్ మంత్రి ఏమీ చేయడం లేదని వాపోయారు. మణిపూర్ హింస గురించి పార్లమెంటులో అడిగినప్పటికీ ప్రధాని ఏమాత్రం స్పందించలేదని, పైగా పార్లమెంటు బయట అన్యాయం జరిగిపోయింది.. ఘోరం జరిగిపోయింది అంటూ సామాన్య ప్రజలు అన్నట్లు ప్రధాని చెప్పడం శోచనీయమన్నారు. మరి అన్యాయం-ఘోరం జరుగుతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. 56 ఇంచులు మందమైన చర్మం ఉన్న ఆయనకి మహిళలపై జరుగుతున్న దారుణాలను తెలుసుకోవడానికి 72 గంటలు పట్టిందా? అని ప్రస్తుతం అంతర్జాలంలో ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయని వివరించారు. మణిపూర్‌లోని హింసకు ప్రధాన కారణం బిజెపినేనన్నారు. వారి రాజకీయ అవసరాల కోసం తెగల మధ్య తగాదాలు పెట్టారని, ఆ అగ్గి రాజుకొని దేశమంతా ఆ మంటలు వ్యాపించాయని వివరించారు. మణిపూర్ ముఖ్యమంత్రిని వెంటనే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన కూడా మణిపూర్ అల్లర్లపై పెదవి విప్పకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జాబీర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురం రామచంద్ర, సిఐటియు జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ 85 రోజులుగా మణిపూర్లో దమనకాండ కొనసాగుతోందని, హత్యలు, అత్యాచారాలు, దారుణంగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళల మాన, ప్రాణాలను కాపాడలేని మణిపూర్ ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలన్నారు. అక్కడి పరిస్థితిని గమనించి కూడా మౌనంగా ఉన్న ప్రధాని మోడీ గద్దె దిగాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యవస్థలన్నీ మణిపూర్‌లో విఫలమయ్యాయని వాపోయారు. ఇప్పటికైనా శాంతి భద్రతలు నెలకొనేలా ప్రధాని చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిద్దమ్మ, నాగమణి, విజయమ్మ, రైతు సంఘం నాయకులు రమణారెడ్డి, హరిప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబు, గుర్రప్ప పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని ఆపాలని, ఆదివాసి మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ట్యాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు షేక్‌వహాబ్, ఉపాధ్యక్షులు రమణ నాయుడు, సహాయ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇద్దరి మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సుందరం, కమిటీ సభ్యులు భాస్కర్, ఎం.మధుబాబు, జోహార్‌బాష పాల్గొన్నారు.

రాయచోటి : నిరసన తెలుపుతున్న సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్ నాయకులు

మదనపల్లె : నిరసన తెలుపుతున్న డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు

అభ్యుదయ మార్గంలో 'సీమ' నవలా సాహిత్యం

కడప అర్బన్ : రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చిన నవలల్లో ఎక్కువ శాతం నవలలు అభ్యుదయ మార్గంలోనే నడచాయని, సామాజిక మార్పులకు అనుగుణంగా రూపుదిద్దుకున్నాయని ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగు అనువాద అధ్యయనాల విభాగం అధ్యక్షులు ఆచార్య కిన్నెర శ్రీదేవి పేర్కొన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో అభ్యుదయ సాహిత్యోపన్యాసాలు 9వ సదస్సు నిర్వ హించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆచార్య కిన్నెర శ్రీదేవి 'రాయలసీమ అభ్యుదయ నవలా సాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. రాయల సీమ నుండి 1950 కి ముందు 20 నవలలు, 1980 తర్వాత 108 నవలలు వచ్చాయన్నారు. కేతు విశ్వనాథరెడ్డి వేర్లు నవలలో దళిత సమస్యలను, బోధిలో స్త్రీ పురుష సంబంధాలను, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి ఒంటరి నవలలో సెజ్‌ల పేరుతో జరుగుతున్న భూదోపిడీని చిత్రించారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ సాహిత్యం మనిషి ఎలా జీవించాలో, ఎలా జీవించకూడదో తెలియజేస్తుందని, అభ్యుదయ సాహిత్యం సమాజంలోని అసమానతలను, వాటి ఫలితాలను వివరిస్తూ దిశా నిర్దేశం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపన్యాస వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సంజీవమ్మ, ఉపన్యాస వ్యవస్థాపకులు డాక్టర్ తక్కోలు మాచిరెడ్డి, విశ్రాంత జిల్లా పరిశ్రమల అధికారి గుర్రాల గోపాల్, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి డాక్టర్ ఎం.ఎం.వినోదిని, బ్రౌన్ గ్రంథాలయ సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, డాక్టర్ సులోచనాదేవి, కొత్తపల్లి రామాంజనేయులు, ముడియం కిశోర్, విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు, శ్రీహరి జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య కిన్నెర శ్రీదేవి

బాలాజీకి వాణిజ్య శాస్త్రంలో డాక్టరేట్

కడప అర్బన్: యోగి వేమన విశ్వవిద్యాలయం కామర్స్ డిపార్ట్‌మెంట్ పరిశోధకులు డి.బాలాజికి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. వాణిజ్య శాస్త్ర శాఖ ఆచార్యులు ఎస్. రఘునాథరెడ్డి పర్యవేక్షణలో 'ఫైనాన్షియల్ ఇన్డెబిటెడ్నెస్ అమాంగ్ అగ్రికల్చర్ ఫార్మర్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు రాయలసీమ రీజియన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్' అనే అంశముపై పరిశోధన చేసి రూపొందించిన సిద్దాంత గ్రంథాన్ని బాలాజి విశ్వవిద్యాలయ పరీక్షల విభాగానికి సమర్పించారు. వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మార్గదర్శకం మేరకు నియమితులైన నిపుణుల బృందం పరిశోధన గ్రంథం అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉందంటూ ధృవీకరించారు.

టిడిపి నుంచి వైసిపిలో చేరికలు

పీలేరు: మండలంలోని బాలంవారిపల్లి పంచాయతీ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కురవపల్లి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం తమ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చీకటిపల్లి చిన్నఎల్లప్ప, మాదాసి కురువ మదారి కురువ రాష్ట్ర ఉపాధ్యక్షులు బెల్లీ జయన్న మదారి కురువ, కొల్లి కృష్ణయ్య, కొల్లి రెడ్డయ్య, బెల్లి నవీన్, కొల్లే హరి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి నుంచి వైసిపిలోకి 30 కుటుంబాలు చేరాయి. పార్టీలో చేరిన వారిలో కృష్ణయ్య, రవీంద్ర, వెంకట శ్రీరాములు, జయన్న, గంగరాజు, కృష్ణయ్య, కొల్లి సుధాకర్, మంగిరి చిట్టి బాబు ఉన్నారు.

మాట్లాడుతున్న సహదేవ నాయుడు, రెడ్డెప్ప

ప్రపంచ జానపద మాసోత్సవాలు

ప్రజాశక్తి -రాయచోటి

తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లా కేంద్రాలలో ప్రపంచ జానపద మహోత్సవాలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సహదేవ నాయుడు, కలకడ రెడ్డప్ప తెలిపారు. మంగళవారం స్థానిక కోర్టు సమీపంలోని అంబేద్కర్ కూడలిలో మన సంస్కృతి కళా సంస్థ (తిరుపతి) వారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 22 న ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలోని జానపద గీతాలను పరిరక్షించుకునే భాగంలో ానపద మాసొత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 1 నుంచి 31 వరకు జిల్లా కేంద్రాలైన తిరుపతి, చిత్తూరు, రాయచోటిలలో జానపద గీతాలాపన ఉంటుందని తెలిపారు. 6న తిరుపతిలోని శిల్పారామంలో, 13న చిత్తూరులో, 20న రాయచోటి ఎన్‌జిఒ హోమ్‌లో, 27న తిరుపతి మహతి కళాక్షేత్రంలో జానపద కళారూపాల గేయాలాపన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మూడు జిల్లాల్లో జానపద గీతాలాపన, జానపద గేయాల పరిచయ నిర్వహిస్తామన్నారు.ఆసక్తిగల జానపద గాయనీ గాయకులు, కళాకారులు 9618489171, 9885947361లలో సంప్రదించాలన్నారు. .కార్యక్రమంలో మన సంస్కృతి కళా సంస్థ (తిరుపతి) గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి, న్యాయవాదులు పాటూరి రెడ్డయ్య, దేవపట్ల నాగముని (గాయకులు), ఆర్.కృష్ణమనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

వర్షంతో నిలిచిన క్రికెట్ మ్యాచ్

ప్రజాశక్తి-కడప

ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో చివరి రోజైన మంగళవారం మ్యాచ్ నిలిచిపోయింది. టి విరామ సమయం తర్వాత ఎంపైర్లు కాల్డ్ ఆఫ్ ప్రకటించారు. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 278 పరుగులు చేసింది. 86 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు ఆట ప్రారంభించిన అనంతపురం జట్టుఆట ముగిసిన సమయానికి 58.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసింది. ఆ జట్టులోని కెప్టెన్ అర్జున్ టెండూల్కర్ 142 బంతులను ఎదుర్కొని 18 బౌండరీలు, 14 బౌండరీ సిక్సుల సహాయంతో 205 పరుగులు (నాటౌట్) చేశాడు. ప్రశాంత్ 56 (నాటౌట్) పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని సుతేజ్ రెడ్డి రెండు వికెట్లు తీసుకున్నాడు. చివరి రోజైన మంగళవారం వర్షం ఆటంకంతో మ్యాచ్‌ను ఎంపైర్లు నిలిపివేశారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు ఆదిత్య సాధించింది.

'కాకులారం' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లి ప్రాంతానికి చెందిన సికిందర్ అనే యువకుడు నటించిన షార్ట్ ఫిలిం కాకులారం సినిమా పోస్టరును పట్టణంలోని విజయ రెడీమేడ్‌లో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ సినిమా చిత్ర బృందంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి ప్రాంతానికి చెందిన సికిందర్ కాకులారం అనే సినిమా చిత్రీకరించడం ఆనందంగా ఉందని, యువకులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఇలాంటి మరెన్నో సినిమాలు తీసి తల్లిదండ్రులకు, రాయచోటి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ నెల 27న విడుదల కానున్న కాకులారం సినిమాను ప్రతి ఒక్కరూ వీక్షించి రాయచోటి ప్రాంతానికి చెందిన సికిందర్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో విజయ్ రెడీమేడ్ షాప్ ప్రొపొరిటర్ ఆనంద్, విజయ్ సోదరులు, సినిమా హీరో సికిందర్, చిత్ర బృందం పాల్గొన్నారు.

కాకులారం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిత్రబృందం

అనాథలైన పిల్లలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

దాతృత్వం చాటుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట :

మండలంలోని నాయునిబావి పంచాయతీ గుట్టపాలెంకు చెందిన వెంకట రమణారెడ్డి కుమారుడు టి.మంజునాథ్‌రెడ్డి శనివారం చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందగా పోలీసులు అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేసిన విషయం తెలిసిందే. తల్లితండ్రులను కోల్పోయిన నలుగురు పిల్లలు అనాధలుగా మిగిలారు మంజునాథరెడ్డికి ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ఈ విషయం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలకు తెలియడంతో చలించిపోయారు. మంగళవారం ఎమ్మెల్యే వారిని కలిసి పరామర్శించి వారిని అక్కున చేర్చుకున్నారు. నలుగురు పిల్లల పూర్తి చదువుకయ్యే ఖర్చు తానే భరిస్తానని, నలుగురు పిల్లల పేర్ల మీద ఒక్కోరికి రూ.2.5 లక్షల చొప్పున రూ.10 లక్షలు పిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తానని హామీనిచ్చారు. పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ద్వారా చదివిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, నాయకులు భీమిగాని ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ రామ్మోహన్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని 108 పైలెట్ రాజు తన కూతురు నిహారిక జన్మదినాన్ని సందర్భంగా వాయల్పాడు పట్టణంలోని శ్రీ చౌడేశ్వరిదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అన్నదానం గొప్పదని, తన కుమార్తె జన్మదినాన్ని నిరాడంబరంగా జరుపుకోకుండా అభాగ్యులకు ఏదైనా చేయాలనే ఆలోచనతో వృద్ధులకు వారికి ఇష్టమైన ఆహారాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు.

బ్లాక్ ఫంగస్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గాలివీడు

బ్లాక్ ఫంగస్ వ్యాధితో చికిత్స పొందుతూ రామ్మూర్తి(50) అనే వ్యక్తి వేలూరు ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ వివరాల మేరకు..గాలివీడు గ్రామంలోని శెట్టివారిపల్లిలో నివాసమున్న రామ్మూర్తి తాపీ పని చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడని అన్నారు. ఇటీవల బ్లాక్ ఫంగస్ బారిన పడి బెంగుళూరులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడాని అన్నారు. అనంతరం వేలూరు సిఎంసి ఆస్పత్రిలో 12రోజుల పాటు ఐసియులో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కొడుకు, కుమార్తె ఉన్నారని అన్నారు. కుటుంబానికి ఆసరగా ఉన్న యజమానికి మృతి చెందడంతో ఆ కుటుంబం అనాథగా మిగిలింది. ప్రభుత్వం, దాతలు ఆయన కుటుంబానికి గ్రామప్రజలు కోరుతున్నారు.

కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయండి

ప్రజాశక్తి-కురబలకోట



తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న తమిళనాడు వాసులు

పిరమలై కల్లర్ కులానికి కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని తమిళనాడు నుంచి వలస వచ్చిన పిరమలై కల్లర్ కులమునకు చెందిన తంగపాండి, జిల్లా మైనార్టీ నాయకులు బావాజాన్‌లు మంగళవారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమిళనాడు నంచి బ్రతుకు దెరువు కోసం తంబల్లపల్లె మండలాల్లో జీవనం సాగిస్తున్నామని అన్నారు. ఇక్కడ ఇరవై కుటుంబాల వారు ముప్పై ఏళ్లుగా జీవిస్తున్నామని చెప్పారు. కులధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదని అన్నారు. కుల ధ్రువీకరణ పత్రాన్ని ప్రభుత్వం నుండి పొందలేక అధికారుల చుట్టూ,నాయకుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. గత ప్రభు త్వాలలో ఎవ్వరూ మా గోడు పట్టించుకోలేదని ఇప్పుడు ఏ పని కావాలన్నా కుల ధ్రువీకరణ పత్రాన్ని అడుగుతున్నారని అన్నారు. తహశీల్దార్ భీమేశ్వర్‌రావు స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఓటు నమోదులో అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి -కలకడ

ఓటర్ల నమోదులో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపాలకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడ తహశీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలో ఎక్కడైనా ఓటుకు అర్హత లేనివారిని ఓటరు జాబితాలో చేరిస్తే శిక్షార్హులవు తారని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన వయస్సు ఉన్నవారు మాత్రమే ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని 59వ పోలింగ్ బూత్‌ను తనిఖీలు నిర్వహించినట్లు తెలి పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రదీప్, బిఎల్ఒ రాధమ్మ, వైసిపి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడిని పరామర్శించిన 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నందలూరు మండలం పాటూరు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గాళ్ళ సుధాకర్ రెడ్డిని ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జున్‌రెడ్డి ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పరామ ర్శించారు. ఆయన ఆరోగ్యాపరిస్థితిపై వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసు కున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సంబంధిత వైద్యులను కోరారు. కార్య క్రమంలో నందలూరు మండల జెసిఎస్ కో-ఆప్షన్ మెంబర్ కలిముల్లాఖాన్, సర్పంచ్ అన్నం నాగేంద్ర, పాటూరు సర్పంచ్ మోహన్‌రెడ్డి, పాలగిరి మల్లికార్జునరెడ్డి , సత్యాల రామకృష్ణ , ఓర్స్ శ్రీను పాల్గొన్నారు.

27న హెచ్ఇసి, సిఇసి గ్రూపులకు నేరుగా ప్రవేశాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణ సమీపంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో హెచ్ఇసి, సిఇసి గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 27న ఉదయం 11.30 గంటల నుంచి పాఠశాల ఆవరణంలో నేరుగా ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షలలో నేరుగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావా లన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోసువారిపల్లి పిహెచ్‌సి డాక్టర్ అనుపమ తెలిపారు. మంగళవారం కోసువారిపల్లెతో పిహెచ్‌సిలో ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎఎన్ఎంలు వారి వారి పరిధిలో పల్లెల్లో ప్రజలను చైతన్య పరచాలని డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించాలన్నారు. చలిజ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించి రక్తపరీక్షలు చేయించు కోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా పెట్టు కుందని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని స్వయం సహాయక సంఘ మహిళాసభ్యులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాటా డుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఉద్దేశంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఆశయంతో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వారి పురోభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని, మహిళలందరూ పారిశ్రా మికవేత్తలుగా ఎదగాల న్నారు. మహిళా సంఘాల పట్టిష్టత, బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలు, బ్యాంకుకు తిరిగి చెల్లింపులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎటిఎం రమేష్, స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

విద్యా సంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికై తలపెట్టిన బంద్ పీలేరులో విజయవంతమైందని ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, టిఎన్ఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ విద్యార్థి, యువజన సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినాయకులు మాట్లాడుతూ జిఒ నెంబర్ 77 తీసుకొచ్చి పీజీ విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు లేకుండా చేశారని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఖాళీలను భర్తీ చేయ లేదన్నారు. ఇస్కాన్ భోజనం నాసిరకంగా ఉందని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, టిఎల్ వెంకటేష్, రెడ్డిశేఖర్, ఎన్ఎస్‌యుఐ నాయ కులు అమృత తేజ, శ్రీకాంత్, సంపత్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు చంద్రబాబు, నసీఫ్, ముబా రక్ పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** విద్యాసంస్థల బంద్ సందర్భంగా ఆర్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ప్రశాంత్ ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. జూనియర్ కళాశాలలకు ఇంతవరకు పూర్తిగా పాఠ్య పుస్తకాలు అందలేదన్నారు. పేద విద్యార్థులు ఉన్నంతచదువులకు దూరంచేసే జిఒ నెంబర్ 77 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు గోవర్ధన్, అవినాష్, ఆభి, చందు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండలంలోని విద్యార్థులకు బంద్ విజయవంతమైందని అఖిల భారత విద్యార్థి బ్లాక్ మండల అధ్యక్షుడు సైఫ్‌అలీఖాన్ తెలిపారు. **నందలూరు:** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యా ర్థుల ద్రోహి అని టిఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ప్రోగ్రామ్స్ కో-ఆర్డి నేటర్ రేవూరి వేణుగోపాల్ అన్నారు. మండలంలో విద్యాసంస్థలు బంద్ నిర్వహిం చారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్, భాను, అజయ్, విజయ్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** విద్యా సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ టిఎన్ఎస్ఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకుల బృందంతో విద్యా సంస్థల బంద్‌లో పాల్గొన్నారు.ఈసందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి మహమ్మద్ మాట్లా డుతూ జగనన్న విద్యా దీవెన, వసతిదీవెన డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయ కులు వంశీకృష్ణ, హరికృష్ణ, సుహేల్, వీరేంద్ర, అనిల్, మహమ్మద్, చోటు, దినేష్, హరిప్రసాద్, రవిచంద్ర పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్ ఆదేశాల మేరకు టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ మదనపల్లెలో విజయవంతమైందని టిఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబులేసు, వినయ్, సంతోష్, రాజేష్, గణేష్, మోహన్ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** విద్యారంగ సమస్యలపై చేపట్టిన బంద్‌కు సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగల శ్రీనివాసులు సంపూర్ణ మద్దతు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ ఆస్టలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.పేద విద్యార్థును విద్యకు దూరం చేసే జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రజియా, వెంకటేశు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కలికిరి

చీడపీడల యాజ మాన్యంపై శిక్షణా కార్యక్రమం మంగళవారం చారవాండ్లపల్లి గ్రామంలో కలికిరి కెవికె శాస్త్రవేత్త వై.పిరుసాహెబ్, జిల్లా వనురుల కేంద్రం అధికారి ఎం.వి.శ్రీకాంత్ వరిని ఆశించే చీడ పీడల యాజమాన్యం మీద శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. వరికి సిఫారసు చేసిన మోతాదులో యూరియా వాడాలని సూచించారు. పొటాష్ ఎరువును ఎకరాకి 25 నుంచి 30 కిలోల ఎరువును విధిగా వాడాలని సూచించారు. వరిలో ప్రతి రెండు మీటర్ల దూరంకి 20 సెంటీమీటర్ల వెడల్పుతో కాలిబాటలు తీయడం ద్వారా పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడపీడల సమస్య బాగా తగ్గుతుదని సూచించారు. ఎరువులు వేయ టానికి, అవసరాన్ని బట్టి పురుగుమందులు వాడాల్సిన పరిస్థితిలో కాలిబాటలు ఉప యోగపడతాయని, వరిని ఆశించే ఆకుముడత పురుగు నివారణకు కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ మందను లీటర్ నీటికి రెండు గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేసుకో వాలని తెలిపారు. వరి, వేరుశనగ పొలాలను సందర్శించారు. అప్పుడే నాట్లు వేసిన వరిలో మూడు నుంచి ఐదు రోజుల లోపు నాటిన దశలో ఎకరానికి 500 మిల్లీలీటర్ల ప్రిటిలాక్లోర్ మందును 20 కిలోలు ఇసుకలో కలిపి పొలంలో చల్లుకో వాలని తెలిపారు. వేరుశనగలో ఒకటి రెండు ఆకులలో పురుగు నష్టం చేసినంతమాత్రాన అనవసరంగా అయిదు నుంచి ఆరువేల రూపాయల పురుగుమందులను వాడవలసిన అవసరం లేదని తెలిపారు. పంట తొలి దశలో ఆకులకు పురుగుల వలన కొంత నష్టం జరిగినా కొత్తగా వచ్చే ఆకులతో ఆ నష్టాన్ని నివారించే శక్తి మొక్కకు ఉంటుందని తెలిపారు. మొక్కల సాంద్రత తగినంతగా ఉంచుకోవడానికి విత్తనం వేసే ముందు కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడే మందుతో విత్తని శుద్ధి చేసుకుని విత్తుకోవాలని సూచించారు. ఒక చదరపు మీటరుకు 33 మొక్కలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. రెండోసారి కలుపు తీసే సమయంలో ఎకరానికి 200 కిలోల జిప్సం ఎరువును వేసుకోవడం ద్వారా గింజ పరిమాణం, నూనె శాతం పెరుగుతుందని పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అగ్రి అడ్వైజరీబోర్డ్ చైర్మన్ కె.వెంకటరమణారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి బి.హేమలత, రైతులు పాల్గొన్నారు

భూ సమస్యకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పెరియవరం రెవెన్యూ పంచాయతీలోని దిగువ రామక్కపల్లె గ్రామంలో గ్రామకంఠ భూమిని ఆక్రమణ చేసిన వ్యక్తి నుంచి భూమిని విడిపించి సరిహద్దు నియమించాలని గ్రామస్తులు మంగళవారం తహశీల్దార్ నరసింహకుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. గ్రామస్తుల ఫిర్యాదును తక్షణ పరిష్కారానికి తహశీల్దార్ చర్యలు తీసుకున్నారు. సర్వేయర్, విఆర్‌ఒలను గ్రామంలోకి పంపి సర్వే చేసి హద్దులు ఏర్పరచాలని ఆదేశించారు. అర్జీ పై తహశీల్దార్‌ను వివరణ కోరగా భూయజమాని సత్తెమ్మ గ్రామదేవతకు కావాల్సిన భూమిన వదలి మిగతా భూమికి కంచె వేసుకుంటానని చెప్పారని అన్నారు. అర్జీ ఇచ్చిన వెంటనే సమస్యను తక్షణమే పరిష్కరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

కేంద్రం నిధులను వినియోగించలేని ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్‌ను తెచ్చుకోలేని, వినియోగించుకోలేని జగన్ ప్రభుత్వం చేతకానిదని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ అనే పథకాన్ని 2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించినట్లు చెప్పారు. ఈ పథకం కుళాయిల ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందివ్వాలని చెప్పారు. 50 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు భరించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద నిధులు ఇవ్వని కారణంగా ఎపిలో ఈ పథకం అమలు కాలేదని విమర్శించారు. గుజరాత్, మరియానా, గోవా రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ పథకం ద్వారా వంద శాతం కుటుంబాలు కుళాయిల ద్వారా తాగునీటిని పొందుతున్నాయన్నారు. వెనుకబడిన రాష్ట్రంగా పేరు గాంచిన బిహార్‌లో కూడా 96.30 శాతం కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మన రాష్ట్రంలో 70.5 శాతం మేరకే కుటుంబాలకు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతున్నట్లు తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకాన్ని జగన్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకపోవడం శోచనీయమన్నారు. కడప-మదనపల్లె-బెంగళూరు నూతన రైలు మార్గంతోపాటు అనేక రైల్వే ప్రాజెక్టులు జగన్ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా నిలిచిపోయినట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వాటాగా ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసి జల్ జీవన్ మిషన్ కింద వంద శాతం కుటుంబాలకు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆయన కోరారు.

సామాజిక అంశాలను యువత మరచిపోవద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్ ఉండడంతో అశ్లీలం విలయతాండవం చేస్తోందని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ప్రొద్దటూరు శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. కార్యాలయంలో ఈ-ఎథిక్స్ వీక్ గోడ పత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు హనీఫ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తనకుతానుగా ప్రశ్నించు కోవాలన్నారు. నిరంతరం అశ్లీలాన్ని చూడడం, కంప్యూటర్ సెల్‌ఫోన్ ముందు గంటలకొద్దీ కూర్చోవడం వల్ల అన్ని అనర్థాలు జరగుతాయన్నారు. అంత ర్జాలంలో పెరిగే స్నేహాలతో మంచి సంబంధబాంధవ్యాలు తగ్గిపోతు న్నాయన్నారు. సామాజిక అంశాలను యువత మరచిపోతోందన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఏజాజ్, ఆదిల్, ముసన్విర్, జుహైర్, అనస్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్ నాటికి పూర్తవ్వాలి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని కమిషనర్ వివి నరసింహారెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇటుకుల తయారీని పరిశీలించారు. క్యూరింగ్ బాగా చేయించాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలను క్రమశిక్షణతో వినాలి

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

విద్యార్థి దశ నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకోని క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సుజాత, ఆర్.సి.యం చర్చి ఫాదర్ ప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్ గ్రాండ్ పేరెంట్స్ డే సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులచే ప్రత్యేక మంగళంారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు పెద్దల పట్ల ప్రేమానురాగాలు, గౌరవ మర్యాదలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిస్టర్ ప్రశాంతి కరస్పాండెంట్, టీచర్ అనూష, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

జగనన్న మహిళా మార్ట్ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

జగనన్న మహిళా మార్ట్ అభివృద్ధికి కృషి చేయాలని మెప్మా పీడీ సురేష్‌రెడ్డి సూచించారు. స్థానిక బిఎస్ఎన్ఎల్ వద్ద జగనన్న మ హిళా మార్టును ఏర్పాటు చేశారన్నారు. మెప్మా కార్యాలయంలో పొదుపు సంఘాలు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న మహిళామార్ట్‌లో బయట మార్కెట్ కంటే తక్కు వ ధరకు దొరికే నిత్యసరుకులు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి మహిళ ఈ మార్ట్‌లో నిత్యవసర వస్తువులు కొనుగోలు చేసేలా అవగాహన కల్పిం చాలన్నారు. మెప్మా డిపిఎం నాగరాజు,, నాగన్న, హరిత పాల్గొన్నారు.

సిసిరోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి

వేగవంతంగా సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని సుద్దమళ్ళ పంచాయితీ తొట్టిగడపల్లిలో సిసి రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ప్రారంభిచారు. అనంతరం అయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సహకారం తో సిఎండిఎఫ్ గ్రాంట్ క్రింద సుద్దమళ్ళ గ్రామానికి రూ.30 లక్షలు రూపాయలు విడుదల చేశారు. ఎంపిపి నిధులతో తొట్టివారిపల్లిలో సిసిరోడ్డు నిర్మాణం చేయటం సంతోషదాయకం అన్నారు. కార్యక్రమంలో వైసిపినాయకులు సూరం వెంకటసుబ్బారెడ్డి, వెంకటరమణ సుబ్బరాజు, మతయ్య, రమణ, శ్రీరాములు, పిచ్చయ్య, రాజేష్ పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగింప జేస్తున్న పంచాయతీ అధికారులు, పోలీసులు

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి బస్టాండ్‌లో రోడ్డు ఆక్రమణలను తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను చేపట్టి, మురుగనీటి కాలువలను నిర్మించిందన్నారు. ఈ క్రమంలో నిమ్మనపల్లి బస్టాండులోని దుకాణదారులు వారి దుకాణాల వద్ద రోడ్డుపై మట్టిని అడ్డుగా వేసి రోడ్డును ఆక్రమించినట్లు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు వారి ద్విచక్ర వాహనాలను, ఇతర వాహనాలను నడిరోడ్డుపైనే నిలుపుతూ ఉండటంతో తర చూ తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. ట్రాఫిక్ సమస్యపై సర్పంచు, పంచాయతీ అధి కారులు, పోలీసులు, దుకాణదారులకు, ప్రజలకు అవగాహన కల్పించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. బస్టాండ్‌లో ఆర్‌టిసి బస్సులు రాకపోకలు కొనసాగించాలన్నా, కొద్ది నిమిషాల పాటు బస్సులు బస్టాండ్‌లో ఆగాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతుండటంపై ఆర్‌టిసి ఉన్నతాధికా రులు ట్రాఫిక్ సమస్యపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన పంచా యతీ అధికారులు, పోలీసులు రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న మట్టిని తొలగించి ట్రాఫిక్ సమ స్యను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. అధికారుల ఆదేశాలను ఉల్లంఘించి, యధావిధిగా సమస్యను సృష్టిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో పంచా యతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, సర్పంచ్ పాపులమ్మ భర్త మల్లప్ప రాజేష్, హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి, కానిస్టేబుల్ శివ పాల్గొన్నారు.

176 మంది నిరుద్యోగులకు ఉపాధి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య

పట్టణంలోని శ్రీ సాయిడిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య సహకారంతో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో 424మంది నిరుద్యో గులు హాజరుకాగా అందులో 176 మంది యువత ఉద్యోగాలు సాధించారని తెలి పారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్‌పిటిసి రత్నమ్మ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించేలా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మో హన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. మెగా జాబ్‌మేళాలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి బి.హరికృష్ణ, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఎంపిపి, తహశీల్దార్

బాధితులకు చెక్కు అందజేత

ప్రజాశక్తి-పుల్లంపేట

చిన్న ఓరంపాడు వద్ద శనివారం జరిగిన బస్సు, లారీ ప్రమాదంలో పుల్లంపేట మండలం రంగంపల్లె సర్పంచ్ కోటకొండ నీలమ్మ భర్త యానాదయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కోటకొండ నీలమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరు చేసిన రూ.50వేలు చెక్కును మంగళవారం ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి , తహశీల్దార్ నరసింహకుమార్ చేతులమీదుగా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ఎటువంటి అవసరమున్నా తమను సంప్రదిస్తే మెరుగైన వైద్యం కోసం సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, విఆర్‌ఎ శీను, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మృతుడి వివరాలను పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐలు

అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండ లంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పెద్దేరు ప్రాజెక్ట్ గంగిరెడ్డిపల్లి పంచాయతీ రేకల కుంట తండాకు మధ్యలోని అటవీ ప్రాంతంలో బుగ్గనవాని బండపై గుర్తుతె లియని మృత దేహాన్ని ఆ దారిన వెళ్లే పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచా రమిచ్చాని తెలిపారు. ఎస్ఐ శోభారాణి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి మొలక లచెరువు సిఐ సాదిక్‌అలీకి సమాచారం ఇచ్చారన్నారు. సిఐ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, మృతదేహం వద్ద ఉన్న సంచిని విప్పి చూడగా అందులో మూడు జతల పాత దుస్తులు, ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొంది ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేసుకున్న రశీదును పరిశీలించినట్లు తెలిపారు. సంబంధిత ల్యాబ్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారని అన్నారు. మృతుడికి వైద్య చికిత్స చేసిన డాక్టర్‌ని కూడా విచారించినట్లు తెలిపారు. మృతుడికి లివర్ పూర్తిగా దెబ్బతిని జాండీస్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందినట్లు తెలిపారు. అతని ఆచూకీ కోసం బి.కొత్తకోట, బీరంగిలో విచారించగా అతడు ఒంటరివాడని, కూలీ పనులు చేసుకుంటూ జీవించే షౌకత్‌అలీ (38) నిర్ధారించారు. విఆర్‌ఒ భరత్ నాయక్ సమక్షంలో పంచనామ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ షౌకత్ అలీ తెలిపారు.